




# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పోర్ట్స్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 160 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/-

గురువారం 16 జనవరి 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepalledgudem, Kadapa, Ongole


## ఇస్రో మరో ఘనత..

# అంతరిక్షంలో స్పేడెక్స్ డాకింగ్ సక్సెస్..!

**స్పేడెక్స్ ఉపగ్రహాల అనుసంధానాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు ఇస్రో వర్గాలు వెల్లడించాయి.**

**(రిపబ్లిక్ న్యూస్), జనవరి 16:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నూతన ఏడాది ప్రారంభంలోనే మరో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇటీవల నింగిలోకి పంపించిన రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసింది. ఈమేరకు స్పేడెక్స్ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు ఇస్రో గురువారం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది.



గత డిసెంబరు 30న తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్సెంటర్ (షార్)లో నుంచి పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్-సీ60 (పీఎస్ఎల్వీ)లో జంట ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపింది. ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ బయలుదేరిన 15.09 నిమిషాలకు స్పేడెక్స్-1బి, 15.12 నిమిషాలకు స్పేడెక్స్-1ఎ రాకెట్ నుంచి విడిపోయాయి. ఆ తర్వాత వీటి డాకింగ్ కోసం మూడుసార్లు ప్రయత్నించగా.. పలు కారణాల వల్ల ఇది వాయిదా పడుతూ వచ్చింది. చివరకు గురువారం వీటి అనుసంధాన ప్రక్రియను చేపట్టారు. ఈక్రమంలోనే రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్ల నుంచి 3 మీటర్లకు తీసుకొచ్చారు. అక్కడ ఉపగ్రహాలను హోల్డ్ చేసి డాకింగ్‌ను మొదలుపెట్టారు. ఇది విజయవంతమైనట్లు ఇస్రో తమ పోస్ట్‌లో రాసుకొచ్చింది. దీనికోసం శ్రమించిన సాంకేతిక బృందానికి, యావత్ భారతీయులకు అభినందనలు తెలిపింది. ఇప్పటివరకు చైనా, రష్యా, అమెరికా మాత్రమే అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేస్తున్నాయి. తాజా ప్రయోగంతో ఈతరహా సాంకేతికతలో భారత్ కూడా వాటి సరసన చేరింది.

### మోదీ హర్షం..

దీనిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. "అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, సాంకేతిక బృందానికి అభినందనలు. రాబోయే సంవత్సరాల్లో మన దేశ ప్రతిష్ఠాత్మక అంతరిక్ష ప్రయోగాలను ఇది కీలక మెట్టుగా నిలిచింది" అని ప్రధాని రాసుకొచ్చారు.

# సంపద సృష్టిస్తాం.. ప్రజల ఆదాయం పెంచుతాం :సీఎం చంద్రబాబు

**గత ప్రభుత్వం హయాంలో అమరావతిని భ్రష్టు పట్టించారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర వృద్ధిరేటుపై సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.**

**అమరావతి, జనవరి 16, (రిపబ్లిక్ న్యూస్):** గత ప్రభుత్వ హయాంలో అమరావతిని భ్రష్టుపట్టించారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర వృద్ధి రేటుపై సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో ఎవరికీ స్వేచ్ఛ లేకుండా చేశారని, పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదిలి పారిపోయేలా చేశారని చంద్రబాబు విమర్శించారు. "సంపద సృష్టిస్తాం.. ప్రజల ఆదాయం పెంచుతాం. అభివృద్ధి వల్ల సంపద వచ్చి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ఆదాయం పెరిగితే పథకాల ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చు. మౌలిక సౌకర్యాల కల్పనలో సంస్కరణలు తీసుకువచ్చా. పవర్ సెక్టార్లో సంస్కరణల ద్వారా రాష్ట్రానికి వెలుగులు తెచ్చాం" అని సీఎం వివరించారు.




# దిల్లీ ఎన్నికలు.. కీలక హామీల పోస్టర్లు విడుదల చేసిన రేవంత్

**దిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలకు సంబంధించి పోస్టర్లను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు.**

**దిల్లీ, జనవరి 16, (రిపబ్లిక్ న్యూస్):** దిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలకు సంబంధించి పోస్టర్లను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. దిల్లీలో 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని.. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలను తాము నెరవేర్చుతున్నట్లు తెలిపారు. రైతులకు రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. "తెలంగాణలో మేము ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తున్నాం. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. విజయవంతంగా ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో 55 వేల ఉద్యోగాలు కల్పించాం. తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోంది. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వాలి" అని రేవంత్‌రెడ్డి కోరారు.




**కాంగ్రెస్ ఎన్నికల హామీలు..**

- రూ.500లకే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్
300 యూనిట్ల ఉచిత కరెంట్
- ఉచిత రేషన్ కిట్లు
- యువ ఉడాన్ యోజన: ఏడాదిపాటు నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ.8,500
- ప్యారీ దీదీ యోజన మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం
- జీవన్ రక్ష యోజన: రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా

70 శాసనసభ స్థానాలు ఉన్న దిల్లీకి ఒకేవిడతలో ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## కేరళ జీవ సమాధి ఘటన..

# మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు

**తిరువనంతపురంలో గోపన్ స్వామి అనే వ్యక్తి జీవ సమాధి అయిన ఘటనలో మృతదేహాన్ని పోలీసులు వెలికితీశారు.**



**తిరువనంతపురం, జనవరి 16, (రిపబ్లిక్ న్యూస్):** కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో గోపన్ స్వామి అనే వ్యక్తి జీవ సమాధి అంశం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఆ సమాధిని తవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో పోలీసులు సమాధిని తవ్వి ఆయన మృతదేహాన్ని వెలికితీశారు. సమాధి వద్దకు ఉదయం 7 గంటలు సమయంలో చేరుకున్నామని.. దానిని తవ్వడాన్ని కుటుంబసభ్యులు తీవ్రంగా వ్యతిరేకించడంతో భారీ భద్రత నడుమ కాంక్రీటుతో నిర్మించిన గోపన్ స్వామి సమాధిని తవ్వామని పోలీసులు పేర్కొన్నారు.

లోపల ఆయన మృతదేహం ధ్యాన స్థితిలో ఉందని.. ఛాతి వరకు పూజా సామగ్రి నింపి ఉందని తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తిరువనంతపురంలోని మెడికల్ కాలేజీకి తరలించినట్లు పేర్కొన్నారు. గోపన్ స్వామి అలియాస్ మణ్యన్ జీవ సమాధి అయ్యారని కొన్నిరోజుల క్రితం ఆయన కుటుంబీకులు పోస్టర్లు ప్రచురించారు. బంధువులు, స్థానికులకు తెలియకుండా అతన్ని నెయ్యటింకరలోని ఓ దేవాలయం సమీపంలో పూడ్చిపెట్టడంతో ఆయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ఎవరూ చూడకుండా తనను సమాధి చేయాలని గోపన్ చెప్పినట్లు ఆయన కుమారులు సనందన్, రాజేశన్ పేర్కొన్నారు. ఈవిషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో.. సబ్ కలెక్టర్ ఆల్ఫ్రెడ్ ఓవీ తన సిబ్బందితో వెళ్లి సమాధిని తవ్వాలని ఆదేశించారు. ఈ చర్యను గోపన్ స్వామి భార్య, కుమారులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు న్యాయపరంగా ముందుకెళ్లారు. సమాధిని తవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో మరోసారి ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనపై విచారణ జరిపిన హైకోర్టు సమాధిని తవ్వి తీరాల్సిందేనని ఆదేశించింది.

# ప్రకాశం జిల్లాలో విషాదం.. సముద్రంలో ఆరుగురు గల్లంతు

**ప్రకాశం జిల్లా సింగరాయకొండలో విషాదం చోటుచేసుకుంది. సింగరాయకొండ మండలం పాకల బీచ్ లో సముద్ర స్నానానికి వెళ్లిన ఆరుగురు గల్లంతయ్యారు.**

**సింగరాయకొండ, జనవరి 16, (రిపబ్లిక్ న్యూస్):** ప్రకాశం జిల్లా సింగరాయకొండలో విషాదం చోటుచేసుకుంది. సింగరాయకొండ మండలం పాకల బీచ్ లో సముద్ర స్నానానికి వెళ్లిన ఆరుగురు గల్లంతయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న మెరైన్ పోలీసులు.. స్థానిక మత్స్యకారుల సాయంతో గల్లంతైన వారి కోసం గాలింపు చేపట్టారు. ఇద్దరు బాలికలు, యువకుడి మృతదేహాలు లభ్యం కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులు పొన్నలూరు మండలం శివన్నపాలెంకు



చెందిన నోసిన జెస్సిక (15), నోసిన మాధవ (25), కందుకూరు మండలం కొల్లగుంట గ్రామానికి చెందిన యామిని (16)గా గుర్తించారు. గల్లంతైన మరో ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతోంది.

## ఈడీ విచారణకు హాజరైన కేటీఆర్..

# కార్యాలయం వద్ద ఉద్రిక్తత

**ఫార్ములా-ఈ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు హాజరయ్యారు.**

**హైదరాబాద్, జనవరి 16, (రిపబ్లిక్ న్యూస్):** ఫార్ములా-ఈ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట హాజరయ్యారు. అంతకుముందు ఆయన గచ్చిబౌలిలోని నివాసం నుంచి బయలుదేరి.. నేరుగా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో బషీర్ బాగ్ లోని ఈడీ కార్యాలయం ముందు భారీ బందోబస్తు చేపట్టారు. సుమారు 200 మంది పోలీసులు అక్కడ మోహరించారు. బాష్పవాయువు, వాటర్కనాన్ల వాహనాలను పోలీసులు తెప్పించారు.



హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్ను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు విచారిస్తున్నారు. ఫార్ములా-ఈరేస్లో నిబంధనల ఉల్లంఘనపై ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

### ఈడీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

మరోవైపు ఈడీ కార్యాలయానికి పెద్దసంఖ్యలో భారాస కార్యకర్తలు చేరుకున్నారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ఇదే కేసులో నిందితులుగా ఉన్న అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. మరోవైపు ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. దీన్ని సవాలు చేస్తూ కేటీఆర్ వేసిన పిటిషన్ ను సైతం బుధవారం 'డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్'గా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో ఈడీ విచారణకు ప్రాధాన్యం ఏర్పడింది.

## 8వ వేతన సంఘం ఏర్పాటు..

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.**

**దిల్లీ, జనవరి 16, (రిపబ్లిక్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు కేంద్రం గుడ్న్యూస్ చెప్పింది. 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వేతన సంఘం సిఫార్సుల మేరకు వేతనాలు పెరగనున్నాయి. 2026 జనవరి 1 నుంచి కొత్త వేతనాలు అమల్లోకి రానున్నాయి. త్వరలోనే కొత్త కమిషన్ ఛైర్మన్, ఇద్దరు సభ్యులను నియమించనున్నారు.

### షార్‌లో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు ఆమోదం

శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,985 కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ప్యాడ్ను నిర్మించనున్నారు. ఎన్జీఎల్వీ, ఎల్ఎంవీకి ప్రయోగాలకు అనుగుణంగా మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఎన్జీఎల్వీ ద్వారా భారీ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. మనుషులను రోదసిలోకి పంపడానికి అనుకూలంగా లాంచ్ప్యాడ్ రూపొందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. నాలుగేళ్ల వ్యవధిలో దీనిని పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు.



## ఫార్ములా-ఈ రేస్ కేసు..

# 18న విచారణకు రావాలని ఏస్ నెక్స్ట్ జెన్‌కు ఏసీబీ నోటీసులు

**ఫార్ములా-ఈ రేస్ కేసులో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) మలివిడత విచారణకు సిద్ధమైంది.**

**హైదరాబాద్, జనవరి 16, (రిపబ్లిక్ న్యూస్):** ఫార్ములా-ఈ రేస్ కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మలివిడత విచారణకు సిద్ధమైంది. ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని విచారించిన విషయం తెలిసిందే. రేస్ నిర్వహణలో తొలి ప్రమోటర్గా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ వ్యవహారంపైనా దృష్టి సారించింది. ఈనెల 18న విచారణకు రావాలని నోటీసులు జారీ చేసింది. 2022 అక్టోబరు 25న జరిగిన తొలి ఒప్పందం ప్రకారం సీజన్ 9, 10, 11, 12 రేస్ నిర్వహణ ఖర్చులను ఏస్ నెక్స్ట్ జెన్ భరించాలి. హైదరాబాద్లో 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో సీజన్-9 రేస్ జరిగింది. అనంతరం 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన సీజన్-10 రేస్ కోసం ఫార్ములా-ఈ ఆపరేషన్స్(ఎస్ఈవో) సంస్థకు 2023 మేలోనే 50% సొమ్ము(రూ.90 కోట్లు) చెల్లించాల్సి ఉన్నా ఏస్ నెక్స్ట్ జెన్ ముందుకు రాలేదు. సీజన్-9తో తమకు నష్టం వాటిల్లిందంటూ చేతులెత్తేసింది. దాంతో ప్రమోటర్ పాత్రను హెచ్ఎండీఏనే పోషించాలని అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశించడంతో 2023 అక్టోబరు 5, 11 తేదీల్లో రూ.45.71 కోట్లను ఎఫ్ఈవోకు హెచ్ఎండీఏ బదిలీ చేసింది. ఈ వ్యవహారమే ఇప్పుడు వివాదానికి కారణమైంది. తన బాధ్యత నుంచి తప్పుకొన్న ఏస్ నెక్స్ట్ జెన్ మీద ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపైనా ఏసీబీ ఆరా తీస్తోంది.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1938: మల్ల వీరుడు, కలియుగ భీముడు బిరుదు పొందిన కోడి రామమూర్తి మరణం (జ.1885).
- 1938: బెంగాలీ నవలా రచయిత, కథా రచయిత శరత్ చంద్ర చటోపాధ్యాయ్ మరణం (జ.1876).
- 1942: రాజకీయ నాయకుడు, పార్లమెంటు సభ్యుడు ఎస్.జైపాల్ రెడ్డి జననం.
- 1943: సంఘసంస్కర్త, త్రిపురనేని రామస్వామి మరణం (జ.1887).
- 1946: భారతీయ బుల్లితెర, చలనచిత్ర నటుడు కబీర్ బేడీ జననం.(చిత్రంలో)
- 1988: భారతదేశపు ఆర్థికవేత్త ఎల్.కె.ఝా మరణం (జ.1913).


కోడి రామమూరి


శరత్ చంద్ర చటోపాధ్యాయ్



ఎస్.జైపాల్ రెడ్డి


త్రిపురనేని రామస్వామి


కబీర్ బేడీ


ఎల్.కె.ఝా

రిపబ్లిక్ స్పోర్ట్స్

## టీమిండియాలో మళ్లీ యో యో టెస్టు..!

**ఆటగాళ్ల ఫామ్, ఫిట్నెస్ విషయంలో బీసీసీఐ ఇకనుంచి కఠిన చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా కొన్నేళ్ల కిందట పక్కనపెట్టిన ఓ రూల్ను తీసుకురానుందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.**




భారత జట్టులో ఒకప్పుడు యో యో టెస్టుతో ఆటగాళ్ల ఫిట్నెస్ స్థాయిని నిర్ధరించేవారు. విరాట్ కోహ్లి కెప్టెన్గా ఉన్నప్పుడు ఈ పద్ధతిని క్రమంతప్పకుండా పాటించారు. అయితే, కఠినమైన పరీక్షతో ప్లేయర్లు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారనే వ్యాఖ్యలు రావడంతో బీసీసీఐ దానిని పక్కన పెట్టేసింది. క్రికెటర్ల ఫిట్నెస్ ఇప్పుడు అత్యంత కీలకంగా మారడంతో ఆ రూల్ను మళ్లీ ప్రవేశపెట్టాలని బీసీసీఐ సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఆస్ట్రేలియా పర్యటనలో ఘోర పరాభవంతో ఇప్పటికే పలు మార్పులకు శ్రీకారం చుట్టిన బీసీసీఐ.. ఆటగాళ్ల ఫిట్నెస్ విషయంలోనూ కఠినంగా వ్యవహరించనుంది. స్క్వాడ్ను ప్రకటించే సమయంలో ఆటగాళ్ల ఫిట్నెస్ను కొలిచేందుకు 'యో యో' టెస్టు నిర్వహించాలని వైద్యబృందం నుంచి సూచనలు వచ్చాయని వార్తలు వస్తున్నాయి. "ఇప్పటివరకు క్రికెటర్లు ఎక్కువ మ్యాచ్లు ఆడుతూ ఉండటం వల్ల బోర్డు ఉదాసీనంగా వ్యవహరించింది. ఇప్పుడు గాయాలు కావడం కూడా ఇబ్బందికి గురి చేసే అంశంగా మారింది. ఫిట్నెస్ విషయాన్ని కొందరు తేలిగ్గా తీసుకుంటున్నారు. అందుకే, ఫిట్నెస్ స్థాయిని నిర్దేశించేందుకు అవసరమైన టెస్టును మళ్లీ తీసుకురావాలని భావిస్తోంది" అని బీసీసీఐ క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఫామ్ విషయంలో ఇప్పటికే దేశవాళీ క్రికెట్లో ఆడాలని స్పష్టమైన ఆదేశాలను జారీ చేసిన సంగతి తెలిసిందే. సరైన కారణాలతో అనుమతి తీసుకున్న క్రికెటర్లు మినహా.. మిగిలిన ఆటగాళ్లు డొమిస్టిక్ క్రికెట్ ఆడాల్సిందే.

### అదనంగా బ్యాటింగ్ కోచ్ ను కూడా..

ఆస్ట్రేలియాతో సిరీస్లో భారత సీనియర్ ప్లేయర్లు రోహిత్, విరాట్ కోహ్లి దారుణంగా విఫలమయ్యారు. ఈక్రమంలో కోచ్ గంభీర్ బృందంలో అదనంగా మరో బ్యాటింగ్ కోచ్ను తీసుకోవాలని బీసీసీఐ భావిస్తోందని సమాచారం. అయితే, ఈ ఇది ప్రపోజల్ స్థాయిలోనే ఉందని.. ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్రీలంకతో వన్డే సిరీస్, కివీస్, ఆసీస్ జట్లతో టెస్టు సిరీస్లను భారత్ కోల్పోయింది. బౌలింగ్లో జస్ప్రీత్ బుమ్రా రాణించినా.. మిగతా బౌలర్ల నుంచి పెద్దగా సహకారం దక్కలేదు. మరోవైపు బ్యాటింగ్ విభాగం తీవ్రంగా నిరాశ పరుస్తోంది. దీంతో పలు మార్పులు చేయాలని బోర్డు భావిస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి.

## 'డాకు మహారాజ్'.. వివాదాస్పద స్టెప్పై స్పందించిన ఊర్వశీ రౌతేలా

**'డాకు మహారాజ్లో డాన్స్పై ఊర్వశీ రౌతేలా స్పందించారు. బాలకృష్ణతో డ్యాన్స్ చేసే అవకాశం రావడం తనకు దక్కిన గౌరవమని చెప్పారు.**



సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన 'డాకు మహారాజ్' హిట్ టాక్ ను సొంతం చేసుకుంది. ఇక ఇందులో తమన్ మ్యూజిక్, పాటలకు విశేష స్పందన వచ్చింది. ఊర్వశీ రౌతేలా బాలకృష్ణల 'దబిడి దిబిడి' సాంగ్ ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. అయితే, ఇందులో ఓ స్టెప్ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ఊర్వశీ రౌతేలా ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడారు. "ఒక సినిమా విజయం సాధించినప్పుడు దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. నేను ఈ విషయాన్ని అర్థం చేసుకోగలను. బాలకృష్ణతో డ్యాన్స్, నటనకు ప్రాధాన్యం ఉండే ఎలాంటి భిన్నమైన సినిమాలనైనా నేను గౌరవిస్తాను. ఆయన లెజెండ్. ఆయనతో కలిసి వర్క్ చేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఇదంతా కళలో భాగం. బాలకృష్ణతో డ్యాన్స్ చేయడం కేవలం పెర్ఫామెన్స్ కాదు.. కళపై నాకున్న గౌరవానికి చేసుకున్న వేడుకగా భావిస్తాను. ఆయనతో పనిచేయడం నా కల. ఈ సినిమాతో అది నెరవేరింది. ఆయన ఆర్టిస్టులకు ఎంతో సపోర్ట్ చేస్తారు" అని చెప్పారు. ఇక ఈ పాట విడుదలైనప్పుడు వచ్చిన ట్రోల్స్పై కూడా ఊర్వశీ ఇటీవల స్పందించారు. 'జీవితంలో ఏం సాధించలేని కొందరు.. కష్టపడేవారిని విమర్శించే అర్హత ఉందనుకుంటారు. ఇది విడ్డూరం. రియల్ పవర్ అంటే ఇతరులను విమర్శించడం కాదు.. వారి గొప్పదనాన్ని ఆదర్శంగా తీసుకోవడం' అని ఓ నెటిజన్కు ఘాటు రిప్లై ఇచ్చారు. బాబీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకువచ్చింది. తొలిరోజు ఈ చిత్రం రూ.56 కోట్లు వసూళ్లు చేసింది. దీంతో బాలకృష్ణ కెరీర్లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల లిస్టో 'డాకు మహారాజ్' చేరింది.

## ఇకపై నా ఫోకస్ 'ఇండియన్ 3'పైనే: శంకర్

**శంకర్ దర్శకత్వంలో కమల్ హాసన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇండియన్ 2'. దీనికి కొనసాగింపుగా 'ఇండియన్ 3' తెరకెక్కనున్న విషయం తెలిసిందే.**



శంకర్ దర్శకత్వంలో కమల్ హాసన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇండియన్ 2'. దీనికి కొనసాగింపుగా 'ఇండియన్ 3' తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ చాలావరకూ పూర్తైంది. ఈ చిత్రాన్ని ఉద్దేశించి శంకర్ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. "మరో ఆరు నెలల్లో 'ఇండియన్ 3' పనులు పూర్తవుతాయి. ఆ సినిమాకు సంబంధించిన భారీ వీఎఫ్ఎక్స్ వర్క్ పెండింగ్లో ఉన్నాయి. కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించాల్సి ఉంది" అని శంకర్ తెలిపారు. 1996లో విడుదలైన 'భారతీయుడు'కు సీక్వెల్స్ రెండు, మూడు భాగాలు సిద్ధమయ్యాయి. రెండో పార్ట సిద్ధార్థ్, రకుల్ ప్రీత్సింగ్, ఎస్ జే సూర్య, బాబీ సింహా, వివేక్, ప్రియా భవానీశంకర్, సముద్రఖని కీలకపాత్రలు పోషించారు. సమాజంలోని అవినీతి, అన్యాయాల్ని రూపుమాపడానికి సేనాపతి ఏం చేశాడు? ఈక్రమంలో ఆయనకు ఎదురైన సంఘటనలు ఏమిటి? అనే ఆసక్తికర అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. మేకింగ్ పరంగా సినిమా ఉన్నతంగా ఉన్నప్పటికీ నిడివి ఎక్కువగా ఉన్నందున అది ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీనిపై శంకర్ స్పందించారు. ఇండియన్ 2కు తాను నెగెటివ్ రివ్యూలు ఊహించలేదన్నారు. పార్ట్ 3లో సేనాపతికి సంబంధించిన గతాన్ని చూపించనున్నారని సమాచారం. శంకర్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్'. రామ్చరణ్ హీరోగా నటించారు. పొలిటికల్ యాక్షన్ ఫిల్మ్ గా ఇది సిద్ధమైంది. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. అప్పన్నగా రామ్చరణ్ అద్భుతంగా నటించారని సినీప్రియులు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ సినిమా ఫలితం పైనా శంకర్ స్పందించారు. "గేమ్ ఛేంజర్ అవుట్పుట్తో నేను సంతృప్తిగా లేను. నేను అనుకున్న దానిప్రకారం ఈ సినిమా నిడివి 5 గంటల వరకు ఉండాలి. సమయాభావం వల్ల కొన్ని సీన్స్ కట్ చేయాల్సి వచ్చింది. దీంతో కథ అనుకున్నవిధంగా రాలేదు" అని శంకర్ తెలిపారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## సైఫ్ దాడి.. ఎంతగానో కలచివేసింది: చిరంజీవి

**బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ పై దాడి జరగడంపై పలువురు సినీ నటులు స్పందించారు. సైఫ్ త్వరితగతిన కోలుకోవాలని కోరుకున్నారు.**



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ పై గుర్తుతెలియని దుండగుడు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై సినీ నటులు చిరంజీవి, ఎన్టీఆర్ విచారం వ్యక్తం చేశారు. విషయం తెలిసి తాము షాకయ్యామని అన్నారు. "సైఫ్ అలీఖాన్పై దాడి నన్ను ఎంతగానో కలచివేసింది. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా" అని చిరంజీవి పోస్ట్ పెట్టారు. "సైఫ్ సర్పై దాడి గురించి తెలిసి షాకయ్యా. ఇది నిజంగా బాధాకరం. ఆయన త్వరితగతిన కోలుకోవాలని క్షేమంగా తిరిగిరావాలని కోరుకుంటున్నా" అని ఎన్టీఆర్ పేర్కొన్నారు. మరోవైపు అభిమానులు సైఫ్ క్షేమంగా ఉండాలని కోరుకుంటూ పోస్టులు పెడుతున్నారు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు దాడి ఘటన చోటుచేసుకుంది. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. ఇంట్లోకి చొరబడిన దుండగుడు దొంగతనానికి యత్నించాడు. అతడిని గమనించిన సైఫ్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. దాడి చేసి పరారైనట్లు తెలుస్తోంది. దొంగతో జరిగిన ఘర్షణలో నటుడికి ఆరుచోట్ల గాయాలయ్యాయి. రెండుచోట్ల లోతుగా గాయమైనట్లు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం సైఫ్కు శస్త్ర చికిత్స జరుగుతోంది. ఈవిషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ దాడిపై సైఫ్ సతీమణి కరీనాకపూర్ టీమ్ ప్రకటన విడుదల చేసింది. "గత రాత్రి సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్ నివాసంలో చోరీకి యత్నం జరిగింది. సైఫ్ చేతికి గాయం కావడంతో ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మిగిలిన కుటుంబ సభ్యులంతా క్షేమంగా ఉన్నారు. ఈ క్లిష్ట సమయంలో మీడియా, అభిమానులు సంయమనంతో వ్యవహరించాలని కోరుకుంటున్నాం. ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దు. పోలీసులు ఇప్పటికే దర్యాప్తు మొదలుపెట్టారు" అని పేర్కొంది. గతేడాది విడుదలైన 'దేవర' కోసం ఎన్టీఆర్, సైఫ్ అలీఖాన్ కలిసి వర్క్ చేశారు. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం పోషించిన ఈ సినిమాలో సైఫ్ భైరవ అనే ప్రతినాయకుడి పాత్రలో నటించారు. సైఫ్ నటనకు సినీ ప్రియులు ఫిదా అయ్యారు.

### అందం

## కొరియన్స్లా మీ ముఖం మెరిసిపోవాలనుకుంటున్నారా, గంజినీటిలో వీటిని కలిపి అప్లై చేస్తే సరి


అందంగా కనిపించేందుకు ఎన్నో ఇంటి చిట్కాలు ఉన్నాయి. వీటి వల్ల ముఖం చక్కగా కనిపిస్తుంది. అలాంటి ఓ టిప్ గురించి తెలుసుకోండి.

అందంగా గురించి ప్రతి ఒక్కరూ ఆరాటపడతారు. దానికోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. కొందరూ కాస్ట్లీ క్రీమ్స్, ఫేస్ప్యాక్స్ వాడతారు. వీటి వల్ల అంతగా రిజల్ట్ ఉండదు. అలా కాకుండా కొన్ని ఇంటి చిట్కాలతో కూడా ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది. అలాంటి వాటిలో గంజినీరు కూడా ఒకటి. ఈ నీటిని వాడడం వల్ల ముఖం ప్రకాశవంతంగా, మృదువుగా కనిపిస్తుంది. ముడతలు కూడా తగ్గుతాయి. మరి ఆ నీటితో ఏం చేయొచ్చో తెలుసుకోండి.



#### కావాల్సిన పదార్థాలు

- గంజినీరు
- తేనె
- నిమ్మరసం



#### గంజినీరు



గంజినీటిలో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. ఇది బ్లీచింగ్ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇది విటమిన్ బితో సహా అనేక ప్రయోజనాలు కలిగి ఉంటాయి. ఇందులో ప్రోటీన్ కూడా ఉంటుంది. దీనిని వాడడం వల్ల చర్మం మృదువుగా, మెరుస్తుంటుంది.

#### తేనె




చర్మ సౌందర్యానికి తేనె బాగా హెల్ప్ చేస్తుంది. ఇది చర్మాన్ని ప్రకాశించేలా చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. తేనెలో శక్తివంతమైన యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ సెప్టిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది సహజంగా చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. దీంతో పాటు చర్మాన్ని బ్యాలెన్స్ చేసి సెబమ్ ప్రొడక్షన్ని తగ్గిస్తుంది.

#### నిమ్మరసం



నిమ్మరసంలో ఎన్నో బ్యూటీ బెనిఫిట్స్ ఉంటాయి. ఇది చర్మానికి మంచి శక్తిని, మెరుపుని ఇస్తుంది. ఫేస్ప్యాక్, ఫేస మాస్క్గా మాత్రమే వాడాలి. జిడ్డు చర్మానికి నిమ్మరసం మంచిది. నిమ్మరసం చర్మానికి మేలు చేస్తుంది. కాబట్టి, దీనిని కూడా ముఖానికి రాయొచ్చు. అయితే, నేరుగా రాయొద్దు. ఎందులోనైనా కలిపి రాయాలి.

#### ఎలా తయారుచేసుకోవాలి



ఇది చాలా ఈజీ. గంజి నీటిని పులియబెట్టొచ్చు. దీనికోసం ముందురోజు గంజినీటిని తీసుకోవాలి. అందులో తేనె కలపండి. దానికి కాస్తా నిమ్మరసం కలపండి. వీటన్నింటినీ బాగా మిక్స్ చేసి అప్లై చేసి మసాజ్ చేయాలి. ఇది చర్మానికి చాలా మంచిది. చర్మాన్ని కాంతివంతంగా, మృదువుగా చేస్తుంది. మచ్చల్ని తగ్గిస్తుంది. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఏ రకమైన చర్మానికైనా వాడొచ్చు. **గమనిక:** నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

